ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఎస్పీని కలిసిన పరిగి డీఎస్పీ

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిగి డీఎస్పీగా ఎన్.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా డీఎస్పీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంగళవారం మర్యాదపూర్వకంగా జిల్లాఎస్పీ నారాయణరెడ్డిని కలిసి మొక్కను అందజేశారు. ఇక్కడ ఇప్పటి వరకు పని చేసిన డీఎస్పీని లగచర్ల ఘటన నేపథ్యంలో డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.



తాండూరు - కొడంగల్, తాండూరు-లక్ష్మీనారాయణపూర్ ప్రధాన మార్గం పక్కన ఉన్న కాగ్నా నదికి ప్రకృతి అలము కుంది. వానాకాలంలో ఈ నది ఉధృతంగా ప్రవహించింది. అనంతరం నీటి ప్రవాహం తగ్గడంతో పాటు ఒంపుగా ఉన్న వైపు నుంచి నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఎత్తుగా ఉన్న ఇసుక దిబ్బలపై గడ్డిపూలు పూసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇసుక మేటలపై కనుచూపు మేర పూలు పూయడంతో కనువిందు చేస్తున్నాయి. ఈ దారిలో వెళ్లే వాహనదారులు శ్వేత వర్ణ గడ్డిపూల అందానికి మంత్ర ముగ్ధులవుతున్నారు. సాయంత్రం సమయంలో మేఘాల మాటుగా ప్రకృతి రమణీయతకు ప్రతిబింబంగా కనిపిస్తుంది. ఈ పూలు ఆకట్టుకోవడంతో వాహనదారులు సెల్ఫీలు దిగుతున్నారు. ప్రకృతి సోయగాన్ని ఆస్వాదిస్తున్నారు.

తాండూరు/బషీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి)



కీసరగుట్టలో కార్తీక పూజల్లో భక్తులు

ఘనంగా రథోత్సవం

▸ తరలివచ్చిన భక్తులు



కడుమూరులో రథాన్ని లాగుతున్న భక్తులు

కీసర/ పూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పూడూరు మండల పరిధిలోని కడుమూరు శివాలయం జాతర వైభవంగా సాగింది. మంగళవారం ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం జరగగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే కీసరగుట్ట శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. కార్తీక మాసోత్సవంలో భాగంగామంగళవారం నిత్యసేవల్లో భాగంగా స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. ఆనంతరం కార్తీక మాసోత్సవం, అరుద్ర నక్షత్రం, పురస్కరించుకొని ఆలయ మహా మండపంలో శ్రీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం జరిగింది.

'లోక్‌మంథన్'లో కొడంగల్ వాసికి అవకాశం



ప్రకాశ్‌ను పరిచయం చేస్తున్న చంద్రశేఖర్

కొడంగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి పెద్ద కల్చరర్ ఫెస్టివల్ రెండేళ్లకు ఒకసారి నిర్వహించే లోక్‌మంథన్ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు ప్రకాశ్‌కు కల్చరల్ ఆర్గనైజర్, కొరియోగ్రాఫర్‌గా అవకాశం దక్కింది. ఈనెల 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని శిల్పాకళావేదికలో జరిగే లోక్‌మంథన్ కార్యక్రమంలో దాదాపు 2వేల మందికి పైగా జానపదకళాకారులు హాజరుకానున్నట్లు ప్రకాష్ తెలిపారు. జానపదాల గొప్పతనాన్ని లోకానికి చాటిచెప్పే లక్ష్యంతో లోక్‌మంథన్ నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎంరేవంత్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా లోక్‌మంథన్ కార్యక్రమంలో తనకు కల్చరల్ ఆర్గనైజర్, కొరియోగ్రాఫర్‌గా అవకాశం కల్పించిన ప్రజా భారతికి సంస్థకు ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రకాశ్ వివిధ రాష్ట్రాల్లో పలు కార్యక్రమాల్లో కొరియోగ్రాఫర్ ప్రశంసలు పొందారు.

పాలేటివ్ కేర్ సెంటర్
సందర్శన
రికార్డులను పరిశీలించిన వైద్యాధికారులు
రోగులకు అందుతున్న వైద్యం పరిశీలన
'ఆలన' వాహన సేవలపై వివరాల సేకరణ
7



తహసీల్దార్ కార్యాలయంలో
బాహాబాహీ
కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవ
ఇరువర్గాలను సముదాయించిన పోలీసులు
7

యంత్రాల కొరత..
పొలంలోనే పంట
వానలకు దెబ్బతిన్న పంటలు
ఉన్న పంటను కోసేందుకు కూలీలు దొరక్క ఇబ్బందులు
8

అర్బన్ పార్కులతో ఆహ్లాదం!

వికారాబాద్ జిల్లా పరిధిలో మూడు అర్బన్ పార్కుల ఏర్పాటుకు సర్కారు శ్రీకారం చుట్టింది. రూ.6 కోట్ల నిధులతో పార్కులను అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా నగరవన్ యోజన, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మూడు రిజర్వు ఫారెస్టుల్లో అభివృద్ధి పనులను ప్రారంభిం చారు. అనంతగిరి కొండల ప్రాంతంలో వాతావరణం దెబ్బతినకుండా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.

- ఒక్కో పార్కు అభివృద్ధికి రూ.2కోట్ల నిధులు మంజూరు
- అప్పాయిపల్లి, జాఫర్‌పల్లి, అనంతగిరి ఫారెస్టుల్లో ఏర్పాటు
- నగరవన్ యోజన, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి
- చైన్ లింక్ ఫినిషింగ్‌తో వాకింగ్, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు
- ఏడాదిలోపు పూర్తి చేసేందుకు సర్కారు కసరత్తు



జిల్లాలో మూడుచోట్ల ఏర్పాటుకు చర్యలు



పార్కు నమూనా

కొడంగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధి కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి రిజర్వు ఫారెస్టు, పరిగి నియోజకవర్గంలోని జాఫర్‌పల్లి, వికారాబాద్‌లోని అనంతగిరి ఫారెస్టుల్లో అర్బన్ పార్కుల అభివృద్ధికి ఒక్కోక్క ఫారెస్టు బ్లాక్‌కు రూ.2 కోట్ల చొప్పున కేటాయించారు. ఫారెస్టుల్లో చైన్‌లింక్ ఫినిషింగ్ ఏర్పాటుతో అక్కడి నుంచే సందర్శకులకు వాకింగ్, సైకిల్ ట్రాక్‌లు, ఎత్తయిన ప్రాంతంలో వాచ్‌టవర్, కుర్చీలు,

మిగతా 8వ పేజీలో...

జాఫర్‌పల్లి ఫారెస్టులో..

పరిగి మున్సిపల్ పరిధిలో పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్, సైకిల్ ట్రాక్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. జాఫర్‌పల్లి ఫారెస్టును అర్బన్ పార్కుగా ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అందులో భాగంగా మంజూరైన రూ.2 కోట్లతో పాటు హైదరాబాద్ మెట్రోపాలిటిన్ ఆథారిటీ ద్వారా మరిన్ని నిధుల మంజూరుతో పనులను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పనులను ప్రారంభించి ఏడాదిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

మురుగుతో మూసీ కంపు

హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియతో మేలు



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎంపీ

విజయవంతం కావాలంటే రాజకీయాలకతీతంగా పని చేయాలి
రైతులకు ఉపయోగపడుతుందంటే సహకరిస్తా
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మూసీ జన్మస్థానం మన జిల్లాలోని అనంతగిరి అని, నీళ్ల స్వచ్ఛంగా ఉంటాయని, హైదరాబాద్ నుంచి మూసీ ప్రవాహం పెరిగినా, డ్రైనేజీ నీరు కలవడంతో కంపుగా మారిందని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని అనంతపద్మనాభ కళాశాలలో మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమంతరావు చతుర్విధ జలప్రక్రియ, మూసి పునరుజ్జీవనం, నీటి భద్రతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా, స్పీకర్‌తో పాటు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, నర్సారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ. వికారాబాద్ జిల్లా మెట్ట ప్రాంతమని వర్షధార మైనర్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు తప్పా మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు లేవన్నారు. జిల్లా మొత్తం సాగు విస్తీర్ణం 5,88,476 ఎకరాలన్నారు. ఇందులో ప్రాజెక్టులు, చెరువులు, బోర్లు, బావుల ద్వారా సాగునీటిని వసతి ఉన్నది 1,57,350 ఎకరాలకు మాత్రమేనన్నారు. మూసీ, ఈసీ, కాగ్నా నదులున్నా ఇవి చిన్నవని వర్షాలు కురిసినప్పుడు వానకాలంలో మాత్రమే నీళ్ల ప్రవహిస్తాయన్నారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండడంతో భూముల ధరలు కోట్లలో ఉన్నాయని, డిమాండ్ ఉన్న పూలు, పండ్లను సాగు చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 1311 చెరువులు, కుంటలు ఉన్నాయన్నారు. సారవంతమైన భూములు ఉన్నా సరైన సాగునీటి వసతులు లేవన్నారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయాంలో కోట్‌పల్లి, నందివాగు, సర్పన్‌పల్లి వంటిమైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి జిల్లాలోని కొంత ప్రాంతానికి నీళ్లందించడానికి సీఎం సకల్పించారన్నారు. నవంబరు 3న కామన్వెల్త్ పార్లమెంట్ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి ఆస్ట్రేలియా వెళ్లడం జరిగిందని, అక్కడి నుంచి స్టడీ టూర్‌లో భాగంగా న్యూజిలాండ్, జపాన్ తరువాత సౌత్ కొరియా వెళ్లాన్నారు. సియోల్ నగరం కూడా మన హైదరాబాద్ లాంటిదే నని అక్కడ

మిగతా 8వ పేజీలో...

ప్రజాపాలన కళాయాత్ర



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ప్రజాపాలన కళాయాత్రను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతిని; నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలు-24 కార్యక్రమాన్ని నిర్వహించాలని సర్కారు ఆదేశాలతో మంగళవారం కలెక్టరేట్ వద్ద ప్రజా కళాయాత్రను జిల్లా అదనపు కలెక్టర్‌లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు డిసెంబరు 7 వరకు ప్రతిరోజు 3 గ్రామాల్లో మొత్తం 114 ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, డీఆర్‌డీఓ సాంబశివరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాంమోహన్, కళాకారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ 70 ఫీట్లకు తగ్గించాలి

శామీర్‌పేట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణలో ప్రభుత్వం చేపట్టనున్న ఎలివేటర్ కారిడార్‌లో తూంకుంటవద్ద 100నుంచి 70 ఫీట్లకు తగ్గించి ఆదుకోవాలని బాధితులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు మంగళవారం అవుటర్ రింగ్ రోడ్డు మార్గంలో ఉన్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను తూంకుంట వద్ద రాజీవరహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలను కోల్పోతున్న బాధితులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ 70 ఫీట్ల వరకు మాత్రమే కుదించి నష్టం వాటిల్లకుండా ఆదుకోవాలని బాధితులు మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ఎంపీ స్పందిస్తూ రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రితో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

▸ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన నిర్వహించారు. ఆయిల్ ఫామింగ్, ఫ్యాక్టరీ నిర్మాణం, కలెక్షన్ సెంటర్ల గురించి అధికారులను రైతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అయిల్‌ఫామ్ సాగు 3 నుంచి 5 ఏళ్లలో మంచి ఆదాయాన్ని ఇస్తుందని చెప్పారు. అలాగే వచ్చేనెల 10వరకు ప్రతి గ్రామ పంచాయతీలో రోజు వారి కార్యక్రమాలు నిర్వహించి మరుగుదొడ్లు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు కలెక్టర్ సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఉద్యానశాఖ అధికారి సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి

నవాబుపేట: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం నవాబుపేట మడలంలో పర్యటించిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులు, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం లాంటి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కల్లులో మత్తుపదార్థాలను వాడితే కేసులు

చేవెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తుపదార్థాలను కల్లు తయారీలో వినియోగిస్తే కఠినచర్యలు తప్పవని చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత చెప్పారు. మంగళవారం ఖానాపూర్, ఇబ్రహీంపల్లి, అంతారం, గొల్లపల్లి, దామరిగిద్ద, కౌకుంట్ల గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో శాంపిల్ సేకరించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ఎలాంటి మత్తు పదార్థాలను కల్లుతో కలపొద్దన్నారు. అల్ఫ్రోజోలం, ఎక్కువ మత్తు కల్గించే ఇతర రసాయనాలు కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపుతామన్నారు. తనిఖీల్లో ఎస్సై మొయినుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.



కల్లు దుకాణంలో శాంపిల్ సేకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు















ప్రమాద స్థలం నుంచి చిన్నారులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

కీసర రూరల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న బస్సు విద్యుత్ స్తంభాన్ని, చెట్టును ఢీకొట్టిన సంఘటన మంగళవారం కీసర మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చీర్యాలలోని డివైన్ గ్రేస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ బస్సు 40మంది విద్యార్థులతో దమ్మాయిగూడ మున్సిపాలిటీ కుందన్‌పల్లి నుంచి కుందన్‌పల్లి చౌరస్తా వైపు వస్తోంది. డ్రైవర్ అజాగ్రత్తగా నడపంతో బస్సు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టడంతో అది విరిగింది. అలాగే కొద్దిదూరం వెళ్లి చెట్టును ఢీకొట్టి నిలిపోయింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమై పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్సలు చేసి ఇళ్లకు పంపించారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్నారు. కాగా బస్సు ప్రమాదంపై తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.



చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

ఆమనగల్లు ఏఎంసీ నియామకం

● చైర్ పర్సన్‌గా యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి ● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కడ్తాల మండలం మక్తమదారానికి చెందిన యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్‌గా కడ్తాలకు చెందిన గూడూరు భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సిఫారసు మేరకు ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. ఏఎంసీ డైరెక్టర్లుగా నరేష్‌నాయక్, తాళ్ల రవీందర్, రమేష్‌గౌడ్, పి.జంగయ్య, యాదయ్యగౌడ్, సంపత్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, అజీం, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, రవీందర్, అంజయ్య నియామకమయ్యారు.



జి.భాస్కర్‌రెడ్డి

మండల సాధనకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని గ్రామస్థులు చేపట్టిన నిరసనలు హోరెత్తుతున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 19వ రోజుకు చేరాయి. దీక్షల్లో వివిధ పార్టీల, సంఘాల నాయకులు కూర్చున్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు





పాలేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించిన వైద్యాధికారులు



పాలేటివ్ సెంటర్‌లో డీఎంహెచ్‌వో వెంకటరవణ తదితరులు

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతగిరిలోని పాలేటివ్ కేర్ సెంటర్‌ను మంగళవారం వైద్యాధికారులు సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరవణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి నిరోష, ఎన్‌సీడీ సమన్వయకర్త రేణుకుమార్, జయరాం సందర్శించి బయటి రోగులకు, ఇన్ పేషంట్లకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఆలన వాహనం ద్వారా అందించే గృహ సందర్శణలపై వైద్యులు వహాబ్, సుప్రియ, ఫిజియోథెరపిస్టులను, స్టాఫ్ నర్సులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ద్వారా క్యాన్సర్, పక్షవాతం, గుండె సంబంధ వ్యాధులకు చికిత్స లందిస్తామని వివరించారు. అనంతరం రిజిష్టర్లను, రికార్డులను, రిపోర్టు లను పరిశీలించారు. సేవలను విస్తృతం చేయాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మండల పరిషత్ అధికారులు, సిబ్బంది

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని మంగళవారం ఆమనగల్లు మండల పరిషత్‌లో జరుపుకున్నారు. అధికారులు, సిబ్బంది కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. ఈ సందర్భంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ, సమాజం, దేశ నిర్మాణం, అభివృద్ధిలో పురుషుల పాత్ర కీలకం అని అధికారులు పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం.. పురుషుల ఆరోగ్యం, పురోగతిపై కూడ శ్రద్ధ వహించాలని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమమాధురి, ఏపీవో మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న హరిలాల్, రాంరెడ్డి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.హరిలాల్ (బొంరాస్‌పేట్), ప్రధాన కార్యదర్శిగా కె.రాంరెడ్డి(మమ్మదాన్‌పల్లి), కోశాధికారిగా డి.రాములు(మంతట్టి) ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి వికారాబాద్‌లో తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజభాను చంద్రప్రకాశ్, రాజగంగారెడ్డి అతిథులుగా రాగా ఎన్నికల అధికారి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాంరెడ్డి వ్యవహరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రాంరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి, సంఘం పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రమేశ్‌నాయుడు

చేవెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చేవెళ్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు అన్నారు. మంగళవారం చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, లెక్చరర్లు రమేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు, సీఐ నర్సింహారావు

యాచారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే 100నంబర్‌కు కాల్ చేసి తెలపాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు కోరారు. మంగళవారం యాచారంలో ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణించొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఆర్టీఏ నూతన యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో సీఐ ఎ.నర్సింహారావు, ఎస్సైలు మధు, సత్యనారాయణ, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థి రాకేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి/కులకచర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01 పాఠశాల 8వ తరగతి విద్యార్థి రాకేష్ అండర్-14 రాష్ట్ర వాలీబాల్ టీంకు ఎంపికయ్యాడు. 18, 19తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ఆడి రాష్ట్ర టీంకు ఎంపికయ్యాడు. డిసెంబరు 10, 11, 12తేదీల్లో యూపీలోని వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆడతాడు. ఈ సందర్భంగా రాకేష్‌ను మంగళవారం ఎంఈవో గోపాల్, పీడీ ఖాజా, టీచర్లు సన్మానించారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి బృహదీశ్వర్ ఎంపికయ్యాడు. చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అతడు ప్రతిభ చూపాడు. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర టీంకు ప్రాతినిథ్యం వహిస్తాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ కృష్ణారెడ్డి, టీచర్లు సత్కరించారు.

బందోబస్తు నడుమ

ఫ్యూచర్‌సిటీ రోడ్డు సర్వే

- గాజులబుర్జు తండా, తుర్కగూడలో మోహరించిన పోలీసులు
- రైతులతో చర్చించిన ఆర్డీవో అనంతరెడ్డి
- రైతుల సమ్మతితో కొనసాగిన సర్వే పనులు



కందుకూరు: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల నిరసనలతో రెండు రోజులుగా నిలిచిపోయిన ఫ్యూచర్ సిటీ రోడ్డు సర్వే పనులు పోలీసుల బందోబస్తు నడుమ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి ఆర్డీవో(ఇబ్రహీంపట్నం) అనంతరెడ్డి, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి రెవెన్యూ అధికారులు, పోలీస్ యంత్రాంగం మండలంలోని గాజులబుర్జు తండా, తుర్కగూడ గ్రామాల్లోని సర్వే చేయాల్సిన భూముల వద్దకు వెళ్లారు. అంతకు ముందు తుర్కగూడకు వెళ్లే ప్రధాన రహదారిపై కొత్త వ్యక్తులను గ్రామానికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆర్డీవో అనంతరెడ్డి ఆయా గ్రామాల రైతులతో చర్చించారు. ప్రభుత్వ ఆదేశానుసారం రావిరాల(ఔటర్ రింగ్ రోడ్డు) ఎగ్జిట్ 13 నుంచి మండంలోని లేమూరు, అగమియా గూడ, తిమ్మాపురం, రాచులూరు, గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామాల గుండా బేగరికంచలో నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి సర్వే పనులు జరుగుతున్నాయని, ఆ పనులను అడ్డుకోవద్దని కోరారు. రైతుల సమ్మతి మేరకే సర్వే పనులను కొనసాగించిన అనంతరం భూములు కోల్పోతున్న రైతులతో వారితో చర్చించి, సర్వే అనంతరం పరిహారం ఇచ్చాకే రోడ్డు నిర్మాణ పనులను కొనసాగిస్తామని రైతులకు అధికారులు వివరించారు.

200 ఫీట్ల వెడల్పు వరకే సేకరించాలి

ప్రభుత్వం నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని,, అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని ఆర్డీవో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూముల గుండా రోడ్డు కోసం తీసుకుంటున్న భూముల్లో 330 వెడల్పు రోడ్డు నిర్మాణం కాకుండా 200 వందల ఫీట్ల వరకే భూమిని సేకరించాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇంతలో స్థానిక నేత వెదిరె రవికాంత్‌రెడ్డి రైతులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు. భూములను ఇవ్వకుండా అడ్డుకుంటే రైతులు నష్టపోతారని తెలిపారు. రైతులకు పరిహారంతో పాటు ఆర్థికంగా వనరులు కావాల్సి వస్తే తాను ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడానికి సిద్ధంగా ఉన్నానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం సర్వే పనులు కొనసాగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, ఎస్సై పరమేశ్, డివిజన్ సర్వేయర్ క్రిష్ణయ్య, ఆర్ఐ యాదయ్య, మండల సర్వేర్ సాయికాంత్, మరియు ఆయ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్న వ్యవసాయ భూమి రోడ్డుకే పోతోంది



నాకు ఉన్న 2ఎకరాల 12గుంటల వ్యవసాయ భూమి ఫ్యూచర్ సిటీ రోడ్డుకే పోతుంది. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భూమి పోతే వారు ఎలాబతుకుతారు. ప్రభుత్వం భూమిని తీసుకున్నప్పటికీ మా కుటుంబానికి జీవనాధారం చూపించాలి. లేని పక్షంలో తమ కుటుంబంతో పాటు రోడ్డుకు భూములు కోల్పోయే ప్రతి రైతులకు అన్యాయం జరుగుతుంది. -డి.లక్ష్మమ్మ, రైతు, బేగంపేట

నేడు గాంధీ భవన్‌లో సేవాదల్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న దశరథం

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవాదల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కానుగుల దశరథం తెలిపారు. ఉత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లులో మంగళవారం విలేకరుల సమావేశంలో దశరథం మాట్లాడుతూ.. సేవాదళ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు కాంగ్రెస్ సేవాదల్ జాతీయ అధ్యక్షుడు లాల్జీ, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మండలాల సేవాదళ్ నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు సేవాదళ్ సభ్యులు విశేషంగా కృషి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సేవాదళ్ ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సేవాదల్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, ఆరిఫ్, అజీం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో బాహాబాహీ

ఇరు వర్గాలను సముదాయించిన పోలీసులు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

తాండూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ ముక్తార్ నాజ్ మంగళవారం గొడవపడ్డారు. ఇరువర్గాల నాయకులు, అనుచరులు గొడవకు దిగారు. దీంతో తహసీల్దార్ తారాసింగ్ జోక్యం వారితో మాట్లాడినా వినకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులొచ్చి వారిని సముదాయించారు. కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తాండూరుకు చెందిన ముక్తార్ నాజ్ షాదీ ముబారక్ చెక్కుల విషయమై కార్యాలయానికొచ్చారు. ఆర్ఐ గోపి వద్ద కూర్చుని చర్చిస్తున్నారు. అదే సమయంలో హబీబ్‌లాల కూడా వచ్చి ఆర్ఐతో మాట్లాడే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తమ పనులు సరిగ్గా చేయడం లేదని హబీబ్ ఆర్ఐతో అన్నారు. దీంతో ముక్తార్ నాజ్ ఉద్దేశ్య పూర్వకంగానే అంటున్నాడని వాదనకు దిగాడు. ఇది గమనించిన తహసీల్దార్ తారాసింగ్ ఆర్ఐ రూంలోకెళ్లి ఏమైనా పనిఉంటే తనవద్దకు రావాలని చెప్పారు. తహసీల్దార్ ముందే ఇద్దరూ వాదించుకుంటూ తోసేసుకున్నారు. గొడవ విషయం తెలిసి ఇద్దరి కుటుంబీకులు ఆఫీసుకు చేరుకొని చొక్కాలు పట్టుకోగా గొడవ పెద్దదైంది. తహసీల్దార్ సమాచారంతో పోలీసులు వచ్చి గొడవపడుతున్న వారికి నచ్చజెప్పి పంపించారు. దీనిపై కౌన్సిలర్ ముక్తార్ స్పందిస్తూ తమకు గత ఎన్నికల విషయంలో గొడవ జరిగిందని, అది మనసులో పెట్టుకొని ఇప్పుడు ఆర్ఐ వద్ద ఉన్న తనతో గొడవపడ్డాడని అన్నారు. హబీబ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న పనులు చేయడం లేదని అన్నానే తప్ప తాను ఎవరితోనూ గొడవ పడలేదన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో పైరవీల జోరు

తహసీల్దార్ కార్యాలయంలో కొందరు పైరవీల దందా చేస్తున్నారు. కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్స్ తదితర సర్టిఫికెట్ల జారీ, సర్వే, పట్టా పాసుపుస్తకం జారీ, రిజిస్ట్రేషన్ పనులకు ఆఫీసు చుట్టూతిరుగుతున్నారు. ఇసుక పర్మిట్లకు కొందరు రాత్రి 8గంటల వరకూ ఆఫీసులో ఉంటున్నారు. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి పైరవీకారులను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ట్రైనీ కానిస్టేబుల్ అభ్యర్థులకు 21న పాసింగ్‌ఔట్ పరేడ్ ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్పీ నారాయణరెడ్డి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ట్రైనీ కానిస్టేబుళ్ల పరేడ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రైనింగ్‌లో నేర్చుకునే పరేడ్ సర్వీస్ ఉన్నతం కాలం పనికొస్తుందని, అందుకే శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపల్ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ వెంకట్రాం, ఆర్ఐ డేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడితే సల్ఫర్ డయాక్సైడ్ విడుదలై వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడారు. వరి కొయ్యలను కుళ్లిపోయేలా చేస్తే ఎరువుగా మారుతుందన్నారు. వరి కొయ్యలను కాల్చితే భూమి సారం కోల్పోతుందన్నారు. భూమి సాంద్రతను కాపాడేందుకు సేంద్రియ విధానాలను అవలంభించాలని సూచించారు. చలికాలంలో కురిసే మంచుతో పత్తిలో తేమ పెరుగుతుందని, కాబట్టి ఎండ ఉండే సమయాల్లోనే పత్తి ఏరాలని, సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు, ఏవోలు శంకర్‌లాల్, చైతన్య, ఏఈవోలు రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

డిసెంబరు 3న జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా డిసెంబరు 3న జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. మంగళవారం జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేకానంద, లక్ష్మారెడ్డిలు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే వివేకానంద క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి జిల్లా నలు మూలల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా విభాగం నాయకురాళ్లు, సభ్యులు, యువజన విభాగం, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని వారు కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లపై వారు చర్చించారు.

రైతులపై కేసులు సరికాదు

కొడంగల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో రైతులపై కేసులు పెట్టి వేధించడం సరైంది కాదని ఉమ్మడి పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవచారి, ముదిరాజు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సురేశ్, కేఎన్‌పీఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ వామన్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం లగచర్లలో బాధితులతో మాట్లాడారు. కంపెనీలకు భూములివ్వం అని 8 నెలలుగా రైతులు చెబుతున్నారన్నారు. అభిప్రాయ సేకరణకు అధికారులు వెళ్లడం సరికాదని, తనపై దాడే జరగలేదని కలెక్టరే ప్రకటించినా రైతులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. రాజకీయ పార్టీల విధానాలన్నీ ఒకటే అని, ఒక్క పార్టీ కంపెనీలను వ్యతిరేకించడం లేదని విమర్శించారు. ఫార్మా కంపెనీని రద్దుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బలవంతపు భూసేకరణ వద్దు



జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాలకు, ప్రయోజనాలకు ప్రజారోగ్యాన్ని కాపాడే ఫార్మా రంగాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని తెలంగాణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్లలో అధికారులపై దాడి దురదృష్టకరమే అయినా రైతుల మనోభావాలు, సెంటిమెంట్లు కూడా ముఖ్యమేనని తెలిపారు. ఎటువంటి రాజ్యాంగబద్ధ పదవిలేని సీఎం సోదరుడికి అధికారులు రాచమర్యాదలు చేస్తూ అతడితో సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలకు అవసరాలకు మించి భూసేకరణ సరికాని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఫార్మా కోసం సేకరించిన భూములను వాడుకోవాలని, మళ్లీ లగచర్లలో భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. ఒక్కో ఫార్మా కంపెనీకి పదెకరాల్లోపే అవసరమని,ఇప్పటికే రాష్ట్రంలో 600 ఫార్మా కంపెనీలున్నాయని పేర్కొన్నారు. ముచ్చర్లలో ప్రభుత్వం 14వేల ఎకరాలు సేకరించిందని, అక్కడే పెడితేనే బాగుంటుందని, లగచర్లలో నిర్బంధ భూసేకరణ దుర్మార్గమని పేర్కొన్నారు.

పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి

హాజరు కండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానం



మంత్రి నాగేశ్వర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెలలో నిర్వహించే షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానపత్రిక అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. షాద్‌నగర్ ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 28, లేదా 29 తేదీల్లో ఉంటుందని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని మంత్రిని కోరారు.

పౌల్ట్రీ రంగానికి ఆస్తి పన్నును మినహాయించండి

పౌల్ట్రీరంగ నిర్మాణాలకు ఆస్తిపన్నును మినహాయించాలని ఎమ్మెల్యే శంకర్ మంత్రిని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా పౌల్ట్రీకి ఆస్తిపన్ను విధించలేదని, ఒక్క షాద్‌నగర్ మున్సిపాలిటీలోనే పౌల్ట్రీకి ఆస్తిపన్ను విధించారని తుమ్మలకు వివరించారు.మున్సిపల్ చట్టంలో పౌల్ట్రీని ఒక యూనిట్‌గా చేసి రూ.100 పన్ను మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నప్పటికీ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఉద్యమకారులు ఐక్యంగా ఉండాలి



జగన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కేశంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పల్లాటి సురేందర్ అన్నారు. కేశంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. ఉద్యమంలో కీలక భూమిక పోషించిన వారంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచారం జగన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యాక్షులు యాదగిరి, నసీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి నక్క చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు శేఖర్, జంగయ్య, కోశాధికారి కందాడ లక్ష్మయ్య, కార్యదర్శులుగా పోలెపోగు మురళి, బోడ జంగయ్య, భాస్కర్, జైపాల్‌రెడ్డి, దశరథంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు పి.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే శాఖలో ఎనిమిదో వేతన కమిషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు ఖాజాబాబు

ఘట్‌కేసర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో పెండింగ్‌లో ఉన్న 8వ వేతన కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు ఖాజా బాబు అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద కార్మికులతో మాట్లాడారు. రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయక కార్మికులపై భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ పోస్టులను భర్తీచేయాలన్నారు. ట్రాక్‌మెన్‌కు 8గంటల పని విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. వచ్చే డిసెంబరు 4, 5 తేదీల్లో జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు మజ్దూర్ యూనియన్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బొలెపల్లి శ్రీనివాస్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి హరికృష్ణ, శ్రీనివాస్, అన్నపూర్ణ, అనుమెగ్‌కుమార్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మహేశ్వరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక నాయకులు

మహేశ్వరం/ఇబ్రహీంపట్నం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఆర్టీసీ డిపోలో గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అల్వాల రవికుమార్ అన్నారు. ఎన్నికల నిషేధానికి విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని మంగళవారం మహేశ్వరం డిపో వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలు ఎత్తేసి, తక్షణమే గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్మికుల ఐక్యత విచ్ఛిన్నానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నిక విధానాన్ని రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ పాలకులు ఆర్టీసీ కార్మికులకిచ్చిన ప్రతీ హామినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవిత, శేఖర్, పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఇబ్రహీంపట్నం డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. కార్మికుల్లో ఐక్యతను దెబ్బ తీసేందుకు 2019లో ప్రభుత్వం ఆర్టీసీలో ఆంక్షలు విధించిందన్నారు. ధర్నాలో నాయకులు కృష్ణ, ఎల్లేష్, బుగ్గరాములు, చందు నాయక్, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి సేవలో ఎంపీ



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాల్లో భాగంగా అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామిని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం బీజేపీ నాయకులతో స్వామి వారిని దర్శించుకోగా ఎంపీకి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీని ఆలయ అర్చకులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, డాక్టర్ రాజశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, శరణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల కొరత.. పొలంలోనే పంట

- కూలీలు దొరక్క ఇబ్బందులు
- ఆందోళనలో అన్నదాతలు



గోనూరులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

తాండూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ఆరుగాలం శ్రమించి సాగు చేసిన ప్రస్తుతం పంటలు చేతికి వచ్చాయి. అకాల వర్షాల కు పంటలు దెబ్బతిని మిగిలిన కాస్త దిగుబడితో అయినా గట్టెక్కు దామనుకుంటే యంత్రాలు, కూలీల కొరతతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో గత వానాకాలం సీజన్‌లో వరిపంటను 5,638ఎకరాల్లో రైతులు సాగుచేశారు. అయితే ప్రస్తుతం పంట చేతికి రావడంతో కూలీలు, యంత్రాల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గోనూరు, నారాయణపూర్, అంతారం, అంతారం తండా, చెంగోల్, అల్లాపూర్ వీరొట్టిపల్లి, బెల్కటూర్, రాంపూర్, పర్వతాపూర్, చింతామణిపట్నం గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. వరికోత యంత్రాలు మహబూబ్‌నగర్, జడ్చర్ల, కర్నూలు, షాద్‌నగర్ నుంచి ఈ ప్రాంతానికి వస్తుంటాయి. అక్కడ కూడా వరిసీజన్ కావడంతో యంత్రాల కొరత తీవ్రంగా ఏర్పడింది.

యంత్రాలు లేక పొలాల్లోనే వరిపంట



ఈ సంవత్సరం వరి పంట ఆశాజనకంగా ఉంది. అయితే వరి కోసేందుకు వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. గత సంవత్సరం వరిపంట కోతకు వచ్చేముందు మహబూబ్‌నగర్, జడ్చర్ల, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి వరి కోత యంత్రాలు ఇక్కడికి వచ్చి రైతులకు అందుబాటులో ఉండేవి. ఈసారి యంత్రాల కొరత వల్ల ఎకరాకు రూ.2500లు ఇచ్చినా యంత్రాలు దొరకడం లేదు. దీంతో వరిపంట పొలంలోనే ఉంది.

- చాకలి బాలప్ప, రైతు, గోనూరు

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



ఘట్‌కేసర్: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్/వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన మహనీయురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లిపావని జంగయ్య యాదవ్, సింగిరెడ్డి రాంరెడ్డి, మహేష్‌గౌడ్, బర్ల రాదాకృష్ణ, రాజేష్, యాదగిరి పాల్గొన్నారు. కాగా ఇందిరా గాంధీ జయంతిని వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. స్పీకర్ ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

తాండూరు: ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తాండూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరాచౌక్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాలాల: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, మారుతి, శేఖర్ పాల్గొన్నారు.

కులకచర్ల: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం కులకచర్ల చౌరాస్తాలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రియాజ్, నర్సింహులు, బుజ్జమ్మ పాల్గొన్నారు.

పరిగి: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం పరిగిలోని టెలిఫోన్ ఏక్చేంజి దగ్గర ఇందిరా గాంధీ విగ్రహనికి డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, తావుర్యానాయక్, శివకుమార్, సాహేద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలో కాంగ్రెస్ మంగళవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మండల వర్కింగ్ బండి జగన్నాథం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కీసర: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కీసర ప్రధాన చౌరస్తాలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్‌లో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తూంకుంట పరిధిలోని దేవరయాంజాల్ ప్రధానచౌరస్తాలో గల ఇందిరాగాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేవరయాంజాల్‌లోని ప్రభుత్వప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.



తాండూరు: ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

ఘట్‌కేసర్ రూరల్: ఘనాపూర్‌లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పరమేష్‌గౌడ్, శివాజీనాయక్, సురేష్‌నాయక్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పార్కులతో ఆహ్లాదం!

(5వ పేజీ తరువాయి)

బెంచీలు, తాగునీటి వసతి, వాష్‌రూమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. పార్కుల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.



అప్పాయిపల్లిలో అర్బన్ పార్కుకు చదును చేసిన ప్రాంతం

180 హెక్టార్ల గుర్తింపు

కొడంగల్ పట్టణంలోని మిషన్ భగీరథ, అప్పాయిపల్లి రిజర్వు ఫారెస్టులో అర్బన్ ఫారెస్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.2 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. ఈ రిజర్వు ఫారెస్టు పరిధిలోని 180 హెక్టార్‌లు అర్బన్ ఫారెస్టు ఏరియాగా అభివృద్ధి చేసేందుకు అధికారులు గుర్తించారు. ఈ పార్కులో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో 50 హెక్టార్లలో చెట్లను నాటనున్నారు. పార్కులో దాదాపు ఆరు కిలో మీటర్లకు పైగా వాకింగ్, సైకిల్ ట్రాక్‌ను రూపొందించనున్నారు. దీంతో పాటు వాచ్ టవర్, రెండు గజబౌల్ ఏర్పాటు చేయనున్నారు. అప్పాయిపల్లితో పాటు నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్‌లో అర్బన్ ఫారెస్టు పరిధిలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో పార్కును ఏర్పాటు చేయనున్నారు. కొత్తూర్‌లో సైతం వాకింగ్, సైకిల్ ట్రాక్‌తో సందర్శకులకు వసతులు ఏర్పాటు చేయన్నారు.

అనంతగిరిని మరింత అందంగా..

వికారాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్న అనంతగిరి కొండల ప్రాంతంలో సహజ వాతావరణం దెబ్బతినకుండా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ వాచ్ టవర్ ఏర్పాటుతో సందర్శకులకు వసతులు కల్పించనున్నారు. ప్రకృతి ప్రేమికులు, పక్షి ప్రేమికులకు సఫారీలను అందుబాటులోకి తీసుకొచ్చి సంవత్సరం వ్యవధిలో మార్పులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. గుట్లపల్లి, అంతారం రిజర్వు ఫారెస్టుల్లో గతంలో నిధులు లేక నిలిచిపోయిన వాటిని ప్రస్తుతం మంజూరైన నిధులతో అర్బన్ పార్కులుగా అభివృద్ధి చేస్తున్నారు. దీంతో జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో అర్బన్ పార్కులు అందుబాటులోకి రావడం హర్షించదగ్గ విషయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఏడాదిలోపు పనులు పూర్తి

కొడంగల్, పరిగి, వికారాబాద్ పరిధిలో అర్బన్ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2కోట్ల చొప్పున రూ.6కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పార్కుల్లో వాకింగ్, సైకిల్ ట్రాక్‌లతో పాటు హెచ్‌ఎండీ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం తదితర అభివృద్ధి జరుగుతుంది. ఏడాదిలోపు పనులు పూర్తి కావడంతో పార్కులు అందుబాటులోకి రానున్నాయి.

-జ్ఞానేశ్వర్, అటవీ శాఖ జిల్లా అధికారి, వికారాబాద్

కులగణనను పకడ్బందీగా చేపట్టాలి

దోమ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను ఎన్యూమరేటర్లు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్‌లకు ప్రజలు సహకరించాలని కోరారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపల్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యూమరేటర్ల బ్లాక్ సూపర్‌వైజర్లకు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ శిక్షణ ఇచ్చారు. సర్వే ప్రొఫార్మాలో వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఎంపీడీఓ మమతాబాయి, మూడుచింతలపల్లి ఎంపీడీవో వత్సలదేవి, ఎన్యూమరేషన్ బ్లాకులకు చెందిన 22 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ప్రతాప్‌సింగారంలోని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఎన్యూమనేటర్లు ఆయన కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 10,853 కుటుంబాల సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో గీతారెడ్డి తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.



ఘట్‌కేసర్ రూరల్: మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో వివరాలు సేకరిస్తున్న ఎన్యూమనేటర్లు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ధారూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకుని రైతులు లబ్దిపొందాలని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని రాంపూర్‌తండా, గురుదోట్ల, నాగారం, మోమిన్‌కలాన్, తరిగోపుల గ్రామాల్లో మంగళవారం ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, రాములు, విజయబాస్కర్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, మల్లారెడ్డి, పాండునాయక్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ అన్నారు. మండలంలోని అంగడిరైచూర్ గ్రామంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో నిల్వ ఉంచుతాం

కులకచర్ల: రైతుల దగ్గర కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ఈ ప్రాంతంలోని రైస్‌మిల్లులో నిల్వ ఉంచుతామని సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సీ శ్రీధర్‌రాజు, డీఎస్‌వో మోహన్‌బాబు తెలిపారు. మండలంలోని పలు రైస్‌మిల్లులను మంగళవారం వారు పరిశీలించారు. తొమ్మిది రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఉంచేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పరంజ్యోతి, సొసైటీ సీఈవో బక్కారెడ్డి, డైరెక్టర్ కొండయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ధారూరు: ధారూరులో నూతనంగా నిర్మించిన రైస్‌మిల్లు, గోదాం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం(రేపు) శాసనసభ స్పీకర్ జి .ప్రసాద్‌కుమార్ రైస్ మిల్లు, గోదాం ప్రారంభించనున్నారు. ధారూరు పీఏసీఎస్ ద్వారా నాబార్డు వారి ఆర్థిక సాయంతో రైస్‌మిల్లు, గోదాం నిర్మాణ పనులకు 13, డిసెంబరు 2022న పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.2.01కోట్ల అంచనాతో రైస్‌మిల్లు, 1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులను పూర్తి చేశారు.

మరుగుదొడ్లను వినియోగించుకోవాలి

కులకచర్ల/పరిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ బహిర్భూమికి వెళ్లకుండా వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా సోమవారం రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఎస్బీఎం ఐహెచ్‌ఎల్ ఆకారంలో కూర్చోని అవగాహన కల్పించారు. పరిగి ఎంపీడీవో కరీం రాపోల్, సయ్యద్ మల్కాపూర్, ఖుదాంద్‌పూర్‌లో పర్యటించారు.

కల్వర్టు మరమ్మతులు చేపడతాం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డితో పాటు కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహిపాల్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగుతో మూసీ కంపు

(5వ పేజీ తరువాయి)

కూడా హన్‌నది డ్రైనేజీ నీరు కలిసి మురుగుతో కంపుగా ఉండేదన్నారు. ఇప్పుడు హన్ నది పరిశుభ్రంగా ఉండడంతో పాటు చుట్టూ టూరిజం అద్భుతంగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం సంకల్పించిన మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడ కూడా అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. గతంలో వాటర్‌షెడ్ పథకాలు చెక్ డ్యాంల నిర్మాణంతో మంచి ఫలితాలు వచ్చాయని, స్వర్గీయ హనుమంతరావు సాగునీటి రంగంలో దశాబ్దాల అనుభవమున్న ఇంజనీరు అని అన్నారు. హనుమంతరావు వాన నీటి సంరక్షణ కోసం రూపొందించిన చతుర్విధ జలప్రక్రియ టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సమయంలో హనుమంతరావును సాగునీటి విషయమై కలిసినట్లు తెలిపారు. తెలంగాణకు పెద్దపెద్ద ప్రాజెక్టులు అవసరం లేదని, ఇలాంటి చతుర్విధ ప్రాజెక్టులు తక్కువ ఖర్చుతో ఉపయోగపడుతాయన్నారు. భూమిలో తేమను కాపాడుకుంటూ మల్చింగ్ విధానం ఉపయోగించాలన్నారు. ప్రభుత్వ పాలసీలు మారాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో ఒకేరోజు 11వేల ఇంకుడు గుంతలు జిల్లాలో తవ్వించినట్లు గుర్తుచేశారు. మాజీ మంత్రి, ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. చతుర్విధ జలప్రక్రియ వల్ల మంచి ఫలితాలు వస్తాయని ఎన్నో రోజులుగా పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, సత్యనారాయణ, వడ్లనందు, సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషన్‌నాయక్, రాంచందర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోవింద్‌నాయక్

కులకచర్ల: అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌కు చెందిన మూడవత్ గోవింద్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత గిరిజన సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గోగులోత్ వెంకన్నానాయక్ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు

వికారాబాద్: విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలను నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి అంజన్ కుమార్ 40 ఓట్లతో విజయం సాధించాడు.

రైతులకు అన్ని వసతులు కల్పిస్తాం

మర్పల్లి: రైతులకు అన్ని వసతులు కల్పిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి పశువుల సంతలో మంగళవారం రైతులకు ఉచితంగా భోజనం అందజేశారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. శామీర్‌పేటకు చెందిన దేశం వెంకటేశ్‌గౌడ్-సోని దంపతులు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పాదయాత్రగా శబరిమలై చేరిన స్వాములు

పరిగి: పరిగి పట్టణానికి చెందిన అయ్యప్పస్వాములు పాదయాత్రగా శబరిమలైకి మంగళవారం చేరుకున్నారు. పర్షమోని రమేశ్‌గురుస్వామి ఆధ్వర్యంలో 19 మంది స్వాములు అక్టోబరు 15న పరిగి నుంచి పాదయాత్రగా బయల్దేరారు.

అంగన్ వాడీ చిన్నారులకు చేయూత

తాండూరు: పాత తాండూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశ్ తన జన్మదినాన్ని పురస్కరించుకోని చిన్నారులకు, పలుకలు, కుర్చీలతో పాటు వాటర్ ట్యాంకు, కుక్కర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్: కండ్లకోయ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గుండ్లపోచంపల్లి పరిధిలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

ఎంపీపీఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

బషీరాబాద్: మండలంలోని కొర్విచెడ్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు పలువురిని ఆకట్టుకుంది.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

పరిగి: పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ధర్మసమాజ్ పార్టీ పరిగి మండల అధ్యక్షుడు ఎ.కృష్ణమహారాజ్ అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అనంతయ్య, శివ, నరేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మోమిన్‌పేట్: మండలంలోని రాంనాథ్‌గూడుపల్లిలో విక్రంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి వైద్యుడు ఓబులేష్ 125 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు.

బీసీ సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు: ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న బీసీ సమర భేరి పోస్టర్‌ను సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు, తాండూరుశాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు.

రక్తదానంతో ప్రాణదాతలవ్వాలి

ఘట్‌కేసర్ రూరల్: రక్తదానంతో ప్రాణదాతలవ్వాలని అనురాగ్ యూనివర్సిటీ ఫార్మాసీ డీన్ వసుధభక్తి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం 63వ జాతీయ ఫార్మాసీ వారోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 200మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్తింటి వేధింపులు తాళలేక ఆత్మహత్య

ధారూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని కుక్కిందలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దోర్నాల్ గ్రామానికి చెందిన స్వాతి(18)ని మండలంలోని కుక్కింద గ్రామానికి చెందిన కొనింటి శ్రీకాంత్(20) రెండేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వివాహం తర్వాత కొంతకాలం వీరి సంసారం సాఫీగానే కొనసాగింది. ఆ తర్వాత భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త, మామలు వెంకటమ్మ, యాదయ్య, ఆడపడుచులు శారీరకంగా హింసించడంతో పాటు సూటిపోటి మాటలతో వేధించేవారు. ఈ మధ్య వీరి వేధింపులు ఎక్కువ కావటంతో భరించలేని స్వాతి ఈనెల 16వ తేదీన సాయంత్రం ఇంట్లోనే పొలంలో గడ్డిమందు తాగి అస్వస్థతకు గురైంది. ఈమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. స్వాతి ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్త, మామ, ఆడపడుచుపై బాల్యవివాహం, పోక్సో, వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించటం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలప లారీకి జరిమానా

బషీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలప తరలిస్తూ పట్టుబడిన లారీకి అటవీశాఖ అధికారులు రూ.20వేల జరిమానా విధించారు. ఈ మేరకు బీట్ అధికారి మల్లయ్య మంగళవారం ధ్రువీకరించారు. ఈనెల 17న మండలంలోని జీవన్గి శివారు లోంచి అనుమతులు లేకుండా కలపను నరికి లారీలో తరలిస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం రాగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో లారీకి ఆశాఖ అధికారులు జరిమానా విధించి వదిలిపెట్టారు. ఎవరైనా అనుమతులు లేకుండా చెట్లనునరికి తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆశాఖ అధికారులు వెల్లడించారు.

బ్లాక్‌మేయిల్ చేసిన వ్యక్తులపై కేసు

పెద్దేముల్, నవంబరు 19: లెక్చరర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన కేసులో యూఎస్‌ఎఫ్ఐ విద్యార్థి నాయకుడితో పాటు ముగ్గురు విలేకరులు, మరో వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ బాలికలను వేధిస్తున్నారనే విషయంలో అతడిపై కేసు నమోదైంది. ఈ విషయమై మీడియాలో, పత్రికల్లో ఆయనపేరు రాయకుండా ఉండేందుకు విద్యార్థి నాయకుడితో పాటు ముగ్గురు విలేకరులు, మరో ఇతరవ్యక్తి రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.2.50లక్షలు తీసుకున్నారని సీఐ తెలిపారు. ఈకేసులో ఏ1 కింద విద్యార్థి నాయకుడు దీపక్‌రెడ్డి, ఏ5గా ఇమ్రాన్ అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసి వారినుంచి రూ.14వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈకేసులో ఇతర నిందితులుగా నిర్ధారణ అయిన ముగ్గురు విలేకరులపైనా కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈకేసులో ఇంకా ఎంతమందికి ప్రమేయం ఉందనే విషయమై విచారణ జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎంకు తీవ్ర గాయాలు

తాండూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని గౌతాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన రమేష్ జాదవ్ మిట్టబాస్పల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నాడు. సమగ్ర కుటుంబసర్వేకు సంబంధించి ఆయనకు సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాల నుంచి బైక్‌పై తాండూరు వస్తుండగా గౌతాపూర్ సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో రమేష్ జాదవ్ బైకును ఢీకొట్టింది. దీంతో అతడి తలకు, చెవులకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ప్రథమచికిత్స నిర్వహించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

మర్పల్లి సంతలో సెల్‌ఫోన్లు చోరీ

మర్పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పక్కనే నిర్వహించే మర్పల్లి సంతలో దొంగతనాలు అధికమయ్యాయి. ప్రతీ మంగళవారం రద్దీగా ఉండే సంతలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. తాజాగా మంగళవారం నిర్వహించిన సంతలో 5 మంది ఫోన్‌లు పోగొట్టుకుపోయినట్లు బాధితులు వాపోయారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంతలో ఫోన్‌పై జేబులో పెట్టుకొని ఆదమరిస్తే క్షణాల్లో ఫోన్లు మాయం అవుతున్నాయని బాధితులు వాపోయారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శుభప్రద్ పటేల్, అశోక్

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. మునిసిపల్ పరిధిలోని యజ్ఞ ఫౌండేషన్‌లో మంగళవారం అనాథ విద్యార్థులకు దుప్పట్లను వికారాబాద్ ప్రాంత వాసి స్టాంప్‌వెండర్ అశోక్ అందించగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ ఉజ్వల్ కుమార్, విలేకరులు గిరీశ్వరస్వామి, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు పరామర్శ

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేషను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. మంగళవారం ఉదయం నాయకులు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, గుడిసె లక్ష్మణ్‌లతో కలిసి చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆలంపల్లిలో మాజీ కో ఆప్షన్ మెంబర్ నజీర్ రెండు రోజులు క్రితం అనారోగ్యంతో మృతిచందగా బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మదన్‌పలిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తాత గోపాల్‌రెడ్డి 15న మృతిచెందగా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాటిచ్చాం.. పనులు చేయిస్తున్నాం

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చినమాట ప్రకారం పనులు చేయిస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు. తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి శివారులో రూ2.8 కోట్లతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రవిగౌడ్, బాల్‌రెడ్డి, సాహుశ్రీలత, ప్రభాకర్‌గౌడ్, బాలప్ప పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మల్‌రెడ్డిపల్లిలో సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మండల మాజీ వైస్‌ఎంపీపీ స్వపారెడ్డి తన నివాసానికి ఆహ్వానించారు. దీంతో ఆయన వైస్ ఎంపీపీ ఇంట్లో తేనేటీ విందును స్వీకరించారు. అనంతరం కొద్దిసేపు రాజకీయాల గురించి చర్చించారు. తమ పార్టీలోకి వచ్చి అభివృద్ధి పనులు చేసుకోవాలని ఎమ్మెల్యే స్వరూపారెడ్డిని కోరారు.

వెంచర్‌లో సర్వే నిలిపివేయాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తమవెంచర్‌లో సర్వే నిలిపివేయాలని పోచారం మున్సిపల్, కొర్రెముల ఏకశీలనగర్ ప్లాట్‌ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొర్రెముల పరిధి సర్వేనెంబర్లు 739నుంచి 749 వరకు 149 ఎకరాల్లో 1985లో ఏకశీలనగర్ వెంచర్ చేశారని, 2005లో బిల్డర్ వెంకటేష్ తప్పుడు పత్రాలు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వివరించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యాల్‌రావు, శివారెడ్డి, ముత్తారెడ్డి, మాటూరి రవి పాల్గొన్నారు.